ఓసారి పండగముందు సైను తానులు కొని బుగ్గి బూడిదమ్మ కొన్ని వందల బనియన్లు కుట్టించింది. వాటిని భోగినాడు బీదలకు పంచి పెట్టడానికి తలపెట్టింది. పేరు కోసమే అయినా కాస్త పారమార్థికం అందులో ఉండాలికదా?

"చక్కగా కాషాయరంగులో ముంచి సాధువులకి తలొకటి ఇస్తే బాగుంటుంది" అని బూడిదమ్మ మొగుడు బుగ్గి వీరరాఘవయ్యగారి విజయరామయ్య పెళ్ళానికి సలహా ఇచ్చాడు. అందుకు బూడిదమ్మ ఒప్పుకోలేదు.

"అలాగేం కుదరదు" అని మొహం చిట్లించింది.

"ముష్టివాళ్ళకోకొల్లలున్నారు. అందులో గుడ్డి. కుంటీ, కుష్టూ ఉంటారు. భోగిపూటా అలాంటివాళ్ళకివ్వడం మంచిది." అని అప్పారావు అభిప్రాయపడ్డాడు ఇంటిని పట్టుకుని ఉండే స్నేహితుడు. బాగా అయినవాడు అప్పారావు. అదీ బూడిదమ్మ అంగీకరించలేదు.

"నాకు అడ్డంగా ఎవరూ ఏమీ చెప్పకండి" అని కాస్త మృదువుగానే అప్పారావుకి చెప్పింది. ఎవరయేని, ఒకరు చెబితే బూడిదమ్మ వినడం కల్ల.

కత్తిర అక్షరాలు చెక్కించి ప్రతీ బనియను పేపుమీద నల్లజీడి రంగుతో "బుగ్గి బూడిదమ్మ ధర్మం" అని అచ్చు వేయించింది. గుడ్డ చిరుగు పట్టినా పక్కా నల్లజీడి అక్షరాలు రంగు కిగ్గడం ఎంత మాత్రం ఉండదు.

కడుపులో చల్ల కదలకండా యింట్లో కూర్చుని బూడిదమ్మ ఏటా వేలకివేలు గణిస్తున్నాది. దాని వ్యాపారం దానికుంది. పెద్ద వ్యాపారస్తులకి పాతికవేలు పదివేలు చెయ్యి మార్పుకి, వారంనాడు తిరిగి ఇచ్చిడానికి, ఎవరికి ఎంత కావలసి వచ్చినా బుగ్గి బూడిదమ్మ అడ్డకిపడ్డ వడ్డీకి ఇస్తుంది.

మార్కెట్టులో ఎవరికి ఇవ్వాలో ఎవరికి ఇవ్వకూడదో, ఎవడి స్తోమత ఎంతో స్టేటు బాంకి ఏజెంట్లుకన్నా బుగ్గి బూడిదమ్మకే బాగా తెలుసు. దాని ఇనపపెట్లో మూలుగుతున్న డబ్బు తాను పుట్టింటనుంచి తెచ్చుకున్న డబ్బు వడ్డీలకు తిప్పగా తిప్పగా పెరిగినదికాని మొగుడిడబ్బు పైసా అందులో లేనిమాట యథార్థం.

అంచేత తన బుద్ధి నచ్చినట్లు చేతికొచ్చినట్లు దాన ధర్మాలు చేస్తుంది. ఒకరి ఆలోచనతో దాని ఆలోచన ఎంతమాత్రం కలియదు.

"ఆ బనియన్లు కుంటికీ గుడ్డికీ ఇయ్యి. నా మాట ఎలాగూ వినవు. అప్పారావు చెప్పినట్టయినా చెయ్యి" అని మరోసారి మొగుడు విజయరామయ్య చెప్పిచూశాడు.

ససేమిరా వినలేదు!

బూడిదమ్మ రిక్షావాళ్ళ కిస్తానంది. రిక్షావాళ్ళకే ఇచ్చింది!

భోగి పండగనాడు ఎనిమిది వందల పన్నెండు రూపాయలిచ్చి కొనుక్కున్న కొత్త పట్టుచీర కట్టుకుని, తలంటేనీళ్లు పోసుకున్న జుత్తు బంగాళీదానిలాగ వెనక్కి సాపుగా పేళ్ళడవేసి బూడిదమ్మ పోర్టికోలో నిలబడ్డాది. భవనం ముందు రిక్షావాళ్లు ముసురుకుని నిలబడ్డారు. కళాసీ ఒక్కొక్క బనియను అందిస్తూ ఉంటే తనచేత్తో తాను ఒక్కొక్కడికీ ఇచ్చింది. అరుగుమీద కూర్చుని గుమాస్తా ప్రతీ రిక్షావాడి బిళ్ళ నెంబరు నోటుచేశాడు. జుత్తు విరియబోసుకుని, వయ్యారం వొలకపోస్తూ ఆవిడ బనియన్లు దానం చేస్తున్న దృశ్యం నాలుగు ఫొటోలు తీయించవలసింది. బూడిదమ్మకి ముందు తోచిందికాదు. తరవాత విసవిసలాడింది.

రిక్షావాళ్ళకి బూడిదమ్మ బనియన్లు ఎందుకు ఇచ్చింది?

ఊళ్లో జనం ఓ చోటునుంచి ఓ చోటికి రిక్షామీదే వెళతారు. సినిమాలకి వెళ్ళడం రావడం రిక్షాలమీదే. కుటుంబాలు ఎటు




ఎందుకు వెళ్ళినా రిక్షాలమీదే. రైళ్ళకి, బస్సులకి రిక్షాలెక్కి వెళ్ళాలసిందే. రిక్షావాడు ముందు కూర్చుని రిక్షా తొక్కుతూ ఉంటే రిక్షాలో కూర్చున్నవాళ్ళకి రిక్షావాడి వీపుమీద 'బుగ్గి బూడిదమ్మ ధర్మం' కనబడి తీరుతుంది.

అది బుగ్గి బూడిదమ్మకి కావలసింది. ఇంతకీ రిక్షావాళ్లూ బీదవాళ్ళేకదా? పేరుతో పాటు ఇంతో అంతో పుణ్యం రాకుండా పోతుందా?

భోగినాడు ఊరు ఊరంతా ఒక్కసారి గుప్పుమంది. "బుగ్గి బూడిదమ్మ ధర్మం" అన్ని వీధుల్లోనూ పరీక్షగా గమనించారు.

"ఒక్కడికి మానకుండా బిళ్ళచూపిస్తే చాలు జనియమిచ్చింది. ఇస్తే అలాగా ఇయ్యాలి!" అనే ప్రతి రిక్షావాడు సంతోషించాడు.

దేనికైనా వేర్పు ఉండాలి ఇస్తున్నాం అనగానే సరికాదు. నయాపైసా ఇచ్చి రూపాయి పేరు తెచ్చుకోవాలి.

బుగ్గి బూడిదమ్మ దానధర్మాలు తలపెట్టడం ఇంట్లో తర్జనభర్జనలు చెయ్యడం మామూలే. టౌను బస్సులు వచ్చి పడ్డాయి కదా! బ్రిడ్జి దిగగానే బస్సుస్టాపు ఉంది. ఊరు మొత్తానికి చెప్పుకోదగ్గ బస్సుస్టాపు. బ్రిడ్జి దిగగానే మూడు రోడ్లు చీలి వూళ్ళోకి మూడు వైపులకీ పోతాయి. బస్సులకోసం పడిగాపులు పడుతూ నిలుచుంటే జనానికి నీడ అవసరంకదా! అందుచేత అక్కడ బ్రహ్మాండమైన "నీడ దొప్ప" అనగా "బస్సు షెల్టరు" బుగ్గి బూడిదమ్మ తనపేరుమీద కట్టించడానికి మునిసిపాలిటీవారు అనుమతి ఇచ్చారు. జింకుషీట్లతో పెద్ద "నీడ దొప్ప" అనగా "షెల్టరు" కట్టించాలి. క్రిందని సిమెంటు చప్టా, వెనక్కి పదిమంది కూర్చోడానికి సిమెంటు బెంచీలు ఏర్పాటు చెయ్యాలి. ఆ "నీడ దొప్ప" ముఖంమీద నల్లగా కుండల్లాంటి అక్షరాలు "బుగ్గి బూడిదమ్మ ధర్మం" అని వుండాలి.

బ్రిడ్జి దగ్గర రోజంతా జన సమ్మర్దం ఉంటుంది. ఉదయం సాయంకాలం చాలా కోలాహలంగా ఉంటుంది. రోడ్డుఅంచులని కుళాయి సామాను, రిబ్బన్లు, దువ్వెనలు, పెన్నులు, పంచాంగం కేలండర్లు, పళ్ళు, కాయలు, పుస్తకాలు, రోహిణా ఆకవాళ్ల కత్తులు కళ్ళజోళ్లు అమ్ముతారు. జనం నిలబడిపోయి గుమిగూడుతారు అమ్మాయిలూ అబ్బాయిలూ తారట్లాడతారు. రిక్షా వాళ్లు ఎక్కడికి పోయేవాళ్ళని అక్కడికి తీసికెళ్ళడానికుంటారు. ఆ ఎత్తు ప్రదేశంలో "నీడ దొప్ప" మొహంమీద ఉంటుంది "బుగ్గి బూడిదమ్మ ధర్మం."

అలాంటి ప్రముఖమైనచోట ఎక్కచ్చని బూడిదమ్మ తన పేరే వేసుకోవడం అంత న్యాయంగా కనబడలేదు. ఫలానా వాడి ధర్మపత్ని ఫలానా అని ఉండాలా! పెళ్ళిళ్ళలో ఫలానావారి పౌత్రీం ఫలానా వారి పుత్రీంఅని చెపుతారుకదా! అలాంటివి కొన్ని పాటించాలికదా!

విజయరామయ్య తనకి తాను ఏ సలహా ఇవ్వలేదు. వినని మనిషితో చెప్పి ప్రయోజనంలేదుకదా! ఆలోచించి అప్పారావు చెప్పాడు. పది మంది పనివాళ్ళలో నూ ఆచరిస్తున్నది. పది మంది మెచ్చుకొనేది అప్పారావు సలహా.

"కీర్తిశేషులు బుగ్గి వీరరాఘవయ్య యీ సత్తెమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి ఏకైక పుత్రుడు యీ విజయరామయ్య మరియు వారి ధర్మపత్ని యీ బూడిదమ్మ గార్లు సమర్పించినది" అని "నీడదొప్ప" అనగా "షెల్టర్" మొహంమీదరాయించి— అక్కడితో అయిపోలేదు! దొప్పకి అటూ ఇటూ విజయరామయ్య క్లబ్బు మెంబరుకదా! – ఫలానా క్లబ్బు సౌజన్యంతో అనికూడా రాయిందాం అన్నాడు ఇదిలోకంలో ఉన్నది. ఆక్షేపణ ఏమీ లేదు.

కుటుంబం మొత్తంమీద పేరుంటుంది. దొప్పకి అటూఇటూ క్లబ్బుకీ పేరు దక్కుతుంది. వ్యక్తులలాగే క్లబ్బులకీ పేరు కావాలికదా! పేరు లేకపోతే క్లబ్బులు దానాలు చెయ్యవుకదా! గుప్తదానాలు చెయ్యడానికి మనం బౌద్ధమతం ఏనాడో వొదిలేశాంకదా!

బూడిదమ్మ వొప్పుకుంటుందా! వొప్పుకోలేదు! విజయరామయ్య చాలా పొరపాటు చేశాడు. ఆ స్థలంలో దొప్ప కట్టించడానికి తనే పూనుకోవలసింది.

"సగం డబ్బు నా పద్దులో సగం డబ్బు నీ పద్దులో పెట్టుకుందాం" అన్నాడు విజయరామయ్య.

"అంత పేరే కావలసివస్తే ఎడమ బస్సు స్టాపు దగ్గర మీరు కట్టించుకోండి" అన్నది కాని సమిషికి బూడిదమ్మ వొప్పుకోలేదు. ఎడం పక్క బస్సుస్టాపు దిగువ పని ఉంది. దీని ఎత్తు, నదరు దానికిలేదు. బ్రిడ్జి దగ్గర ఎత్తులో "నీడదొప్ప" మీద పేరుండడం ఏం మజాకా కాదు. వూరికి

ఒకటో రకమైన స్థలం బూడిదమ్మ కొట్టేసింది.

అందుచేతే విజయరామయ్య ప్రలోభ పడుతున్నాడు.

“నాలుగొంతులు నేను పెట్టుకుంటాను. ఒక వొంతు నువ్వు పెట్టుకో. అప్పారావు చెప్పినట్టు రాయించు.” అని ప్రాధేయ పడ్డాడు విజయరామయ్య.


## మీ పిల్లల చదువా?

ఆందోళన దేనికి? ఆలోచన కావాలి!

క్లాసువారీగా ఏండ్ల తరబడి చదవక్కర్లేదు. వేలు ఖర్చు పెట్టనక్కర్లేదు. పరీక్షల్లో విజయం. జీవితంలో క్రమశిక్షణ కావాలంటే నేడే కార్డు వ్రాయండి.

# రవి కళాశాల

## బ్రాడీపేట - గుంటూరు - 2.

18 ఏండ్ల తర్వాత ఎన్నో వినూత్నమైన బోధనా పద్ధతులను, ఆధునికమైన హాస్టలు వసతులను ప్రవేశపెట్టాం.

5వ తరగతి మొదలు మెట్రిక్, 10వ తరగతి, ఇంటర్, మెడికల్ ఎంట్రెన్సులకు ఇంగ్లీషు తెలుగు మీడియంలలో శిక్షణ ఇవ్వబడును.

ముఖ్య గమనిక

ఇంతవరకూ మేము మెట్రిక్‌లో మెడికల్ ఎంట్రెన్సులో వందల సంఖ్యలో సాధించిన క్లాసులు. సీట్ల వివరాలకై వ్రాయండి. ఎక్కడైనా ఇటువంటి సంస్థ ఉన్నదేమో ఆలోచించండి.

## అడ్మిషన్సు జూన్ 1 నుండి

## మెట్రిక్ క్లాసులు హాస్టలు జూన్ 10 నుండి

మిగిలిన క్లాసులు ఆయా పరీక్షా ఫలితాలొచ్చిన తర్వాత ప్రారంభమగును.

ఫోన్సు : 20917, 21192, 21545

సి. వి. యన్. ధన్, M.A.
డైరెక్టరు.

"లోకం మెచ్చుకుంటుంది. అలాగ్గా చెయ్యి" అన్నాడు అప్పారావు.

"వాళ్ళమ్మ, వాళ్ళయ్య జ్ఞాపకం కోసం వారి పేరు, వారి కర్ర పేరు. వేసుకుని నాలుగొంతులు ఇస్తారట! నాకర్మ కాలింది! వీళ్ళ చేట భారతం రాస్తే పది కట్టలు ఎవరు చదువుతారు? అంత కావలసివస్తే తనే దరఖాస్తు పెట్టుకోలేదేం? ఆనాడు దేవాలయం సింహద్వారం కట్టించలేక పోయారా?" అని ప్రశ్నించింది బూడిదమ్మ.

విజయరామయ్య బుర్రకి తట్టలేదు. బూడిదమ్మకి "పేరు" కనబడితే పెద్దపులి లాగ పట్టుకుంటుంది. దేవాలయంలో ఏమైంది?

దేవాలం సింహద్వారం శిథిలమైపోయిన దశ దాటి పోయింది. పెద్దలంతా కట్టిద్దాం కట్టిద్దాం అంటూ సంవత్సరాలు దాటించేస్తున్నారు. ఒకనాడు సీతారామాంజనేయస్వాములవారి ఆలయంలో పెద్ద సభ అవుతున్నది. ఊరి పెద్దలంతా ఆడా మొగా దేవాలయం నిండిపోయి కూచున్నారు. ఆ మహాసభలో ధర్మకర్తగారు నిలుచుని విన్నపం చేశారు.

"అయ్యా పెద్దలంతా సమావిష్టులై ఉన్నారు. చిరకాలమై దేవాలయం సింహద్వారం శిథిలమై పోయి ఉన్నాది. పటుత్వం చిన్నతనంగా ఉంది. ఇక్కడున్న పెద్దలలో ఏ ఒక్కరైనా కట్టించడానికి సమర్థులు. ఇంతమంది సమావేశం కావడం ఎప్పుడూ సాధ్యం కాదు కాబట్టి ఈ నాడు ఈ సభలో చందా ఎత్తి సింహద్వారం ఏర్పాటు చెయ్యవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అని ధర్మకర్తగారు సరియైన సమయం చూసి ఓ రాయి విసిరేరు.

లక్షలు లక్షలున్న వాళ్లు సభలోంగా ఉన్నారు. ఒక్కడు లేవలేదు. విజయరామయ్య ఉన్నాడు. లేచి కట్టిస్తాననలేక పోయాడా? పిల్లా పీచూ లేదాయె! ఇంట్లో లింగూలింగూమని తనూ బూడిదమ్మ తప్ప ఎవరూ లేరు!

ఎందుకూ వెధవ డబ్బు? విజయరామయ్య తక్కువవాడా? సినిమా హాలుంది. నాలుగు బస్సురూట్లున్నాయి. పప్పుల మిల్లుంది. హోలుసేలు కొట్టుంది. అనేక బిజినసులు స్పెక్యులేషను చేస్తాడు. మూడు లారీలున్నాయి. మూడు లక్షలు విలువ చేసే మేడలో వుంటున్నాడు. కారులో తప్ప కాలు కింద పెట్టి ఎరగడు.

బుగ్గివారి వంశం సామాన్యమైనదా? బుగ్గివారు లేనిచోటు భారత దేశంలో ప్రాచీనకాలంలో లేదు. ఈనాడు లేదు! నాగరాజుకి పూర్వం ఆంధ్రదేశంలో బుగ్గివారున్నారు. శైలోద్భవరాజుల కాలంలో బుగ్గి పరమేశ్వరయ్య అనే సముద్రపు వ్యాపారస్తుడికి ఆరువందల ఓడలున్నట్లు పాలూరు తవ్వకాలలో బైటపడ్డాది. బుగ్గివారి రాగిపట్టాలు తక్షశిలలోనూ మామల్లపురంలో దొరికాయి. బుగ్గివారు దేశం నిండా వున్నారు ఆనాడూ ఈనాడూ!

దేవాలయంలో అంతమందిలో బుగ్గివాడు బుగ్గిబుద్ధి చూపించుకున్నాడు కాని లేచి ఇవ్వక పోయాడా?

సింహప్పిల్లలా లేచింది బూడిదమ్మ! కంచుకంఠమెత్తి సింహద్వారం నే కట్టిస్తానంది! బూడిదమ్మ కంఠాన్ని, దేవాలయం

బాలింత ప్రసవించినవారికి ఉపయోగం
• ప్రథమమూన సూతికకు, ఒడలు ఆర్చుట (కాయము)
• తర్వాత మాతృస్తన్యవృద్ధికి, జీర్ణశక్తికి, రక్తవృద్ధికి మంచిది.
బెటిక్స్ లివర్ డ్రాప్స్ 1942 స్థాపితం
• లివర్, ఉబ్బస వ్యాధుల నివారించి బలమునిచ్చును.
తయారు: ఔషధి ఫార్మస్యూటికల్స్. గుడివాడ.
• అన్ని మందుల షాపుల యందు దొరకును.

కుటుంబాన్ని మారుపేరికాయి. అరగంట తప్పట్లుకొట్టారు. అరగంటః తెప్పుకుంటే పేరు పదిమందిలో అలాగ్గా తెచ్చుకోవాలి.

ఇచ్చిన మాటప్రకారం-దమ్మిడి ఏగాణీ కాదు పన్నెండు వేలుపెట్టి మకరతోర ణంతోసహా సింహద్వారం కట్టించింది. మీద అర్ధవృత్తాకారంలో "శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయులవారి ఆలయం" అని ఉంది. అర్ధవృత్తం కడుపులో "ద్వార సమర్పణ బుగ్గి బూడిదమ్మ" అని ఉంది. అప్పటినుంచి దేవాలయానికి ఎంతమంది వెళ్తున్నారో అంతమంది కళ్ళల్లో "బుగ్గి బూడిదమ్మ" పడుతూనే ఉంది.

ఆలోచించి ఆలోచించి అప్పారావు మరో సలహా ఇచ్చాడు.

"నీకు ధర్మముంటుంది. నామాటకాస్త విను. షెట్టరుమీద చేటభారతం రాయొద్దు. బుగ్గి జయరామయ్యగారి ధర్మపత్ని బూడిదమ్మగారి ధర్మం అని రాయించు" అన్నాడు. మొగుడిపేరు వేసుకోక పోవడం ఊళ్ళో అసహ్యంగానేఉంది. అది తెలిసే అప్పారావు చెప్పేడు.

"ఎక్కచ్చిగా నాకు నా పేరే కావాలి. వేనలాంటి ధర్మపత్నినికాదు." అనేసింది బూడిదమ్మ. మొగుడి చాటునే బతుకు తున్నాది కాని మొగుడికి వీసమంత విలువ ఇవ్వదు.

"ఎంచికొచ్చినపేరు: చచ్చాక ఏమె మ్మందో చూసుకో" అన్నాడు విజయ రామయ్య.

"ఓహో: తమ రెందుకు అంత పాకు లాడుతున్నారు? చచ్చాక ఎవరికీ ఏమీ లేదు. పిల్లలు పుట్టా చావా అయితే బూడి దమ్మని నాకు పేరు పెట్టారు. పెళ్ళిచేస్తే అత్తవారు బుగ్గివారయ్యారు. దాంతో బుగ్గి బూడిదమ్మ అవతారం ఎత్తింది. భూమ్మీద పుట్టిన వాళ్ళంతా ఆఖరుకి బుగ్గి బూడి దమ్మలూ, బుగ్గి బూడిదయ్యలూ. బతి

## మరవ

నిన్ను వల్లె వేసుకొంటున్నప్పుడు
నీలిమల్లు నాలో నిండారగానే
జేవురించిన ముఖంతో సూర్యుడు
చెమటోడుస్తూ వస్తాడు
నిన్నటి అనుభూతులను అదేపనిగా
నెమరు వేసుకొంటున్న నీలాంబరాలు
దుప్పటీని దులిపేశాక
ఎప్పటిలాగే మౌనంగా ఉంటాయి
కిటికీలు తెరవగానే నీ సువాసనలు
మటుమాయం కావడానికి
పయనిస్తాయి
అగరొత్తుల భస్మశేషం
అరకొరగా ఉన్న హృదయచషకం
నిదురమత్తు దోమతెరల వెనుక
పదిలంగా పవళిస్తున్న పరిమళం
వెచ్చదనానికి హెచ్చరిక చేస్తోంది
'ఇచ్చట హృదయాలు నింప
బడును'
ఈ మగత నన్ను వదలకూడదనీ
ఈ మమత నాలో కరగకూడదనీ
ఎక్కడున్నా సరే నువ్వు కోరు
కుంటున్నావని
రెక్క విప్పిన నా గుండెలకు తెలుసు

—ఆరుద్ర

---

కుండగా నాపేరు నలుగురు చెప్పుకోవాలి. చచ్చేక నాకెందుకు:" అన్నది.

"చెప్పుకుంటారులే" అన్నాడు విజయ రామయ్య. అతడికి చాలా కష్టంగా ఉంది.

భరించవలసిందే. భార్యని కాని ఇలాంటి భార్యని భరించడం మహాపాపం.

"ఎవరికోసం చెప్పుకుంటారు?" అన్నది బూడిదమ్మ.

"నేను కనబడ్డవి చెప్పుకుంటాను. కనబడనివి చెప్పుకోను. కనబడనివే కనబడితే మరీ చెప్పుకుంటాను." అన్నాడు వొళ్ళు మండిపోయి విజయరామయ్య. అక్కడ ఉండడం సభ్యత కాదని అప్పారావు వెళ్ళిపోయాడు.

"కనబడనివే కనబడి చెప్పుకున్నా నాకేం ఫరవాలేదు" అని బూడిదమ్మ వెళ్ళిపోయింది.

పూటకో చీర కట్టి, పూటకో సెట్టు నగలు పెట్టుకుని ప్రతిపూటా బ్రిడ్జి దగ్గరకు కారులో వెళ్ళి బూడిదమ్మ అందరిమధ్యా నిలబడి "నీడదొక్కు భారీగా" కట్టించింది. అనుకోవాలి కాని అనుకున్నంతా చేస్తుంది. పిసినారితనం పిసరంత లేదు. "నీడదొక్కు" అనగా "షెల్టరు" ముఖంమీద ఢంకా అంతలేసి అక్షరాలు- "నిర్మాత బుగ్గి బూడిదమ్మ" అని రాయించుకుంది. ఢంకాల్లాగే ఆ అక్షరాలు బ్రిడ్జి దగ్గర ఢంకామోత పెడుతున్నాయి.

బూడిదమ్మ "నీడదొక్కు" వెలిశాక ఊరు ఊరంతా ప్రతి బస్సుస్టాపు దగ్గరా ఊళ్లో పెద్దల చిత్ర విచిత్రమైన పేర్లతో "కీర్తిదొక్కులు" వెలిశాయి.

వేసవికాలం రాగానే బ్రిడ్జి దగ్గర "నీడదొక్కు" పక్కని పెద్దపెద్ద బానలతో ఉప్పు నిమ్మకాయ రసం వేసిన మజ్జిగతేట దాహం ఇవ్వడానికి ఏర్పాటు అయింది. బానల వెనకాతల రెండు వెదుళ్ళకి ఎర్ర బేనరు "బుగ్గి బూడిదమ్మ చలివేంద్రం" అని కట్టబడ్డాయి.

బుగ్గి బూడిదమ్మ ధర్మాలు ఊరునిండా ఉన్నాయి. నక్కలపేట ప్రజలు నీళ్ళులేక ఇక్కట్లు పడుతూ ఉంటే ఎవరు పట్టించుకున్నారు? మునిసిపాలిటీ సంవత్సరాల తరబడిని ఏమిచేసింది? నక్కలపేట నుయ్యి బూడిదమ్మ తవ్వించింది. రాతి ఫలకం మీద "బుగ్గి బూడిదమ్మ ధర్మం" రాయించుకుని నూతిగట్టుపై శాశ్వతంగా స్థాపించుకుంది. నక్కలపేట ప్రజల నీళ్ళకోసం ఎంతమాత్రం కాదు. బుగ్గి బూడిదమ్మ పేరుకి.

దేవాలయం గోడలనిండా పురుగులు పట్టినట్టు దాతల పేర్లు! ఎవరెంత ఇచ్చారో రాయించేసుకున్నారు. వాళ్ళిచ్చారని వీరూ వీరిచ్చారని వారూ గుప్తదానం చెయ్యమనండి. దేముడికి రూపాయి చందా లేవదు!

"కనబడ్డవి చెప్పుకుంటాను. కనబడనివి చెప్పుకోను" అని బాధతో అన్నాడు విజయరామయ్య! లోకం గుడ్డిదనుకుంటున్నాడు. లోకం కళ్ళు ఎక్స్‌రే కళ్ళు! చేసేదిలేక వీధిని పడలేక అసహ్యంగా మూసుకుని విజయరామయ్య కప్పెట్టుకొస్తున్నాడు.

కాని బుగ్గి బూడిదమ్మకీ, అప్పారావుకీ ఉన్న అక్రమసంబంధం పెద్ద పేరుతో ఊరంతా ఎప్పుడో ఢంకా మోత పెట్టేసింది! పూరుదాటి పూళ్ళు పూళ్ళకీ పోయి బంధుమిత్ర వర్గమంతటా వలయాలు తిరుగుతున్నాది.

దానధర్మాలతో బుగ్గి బూడిదమ్మ తెచ్చుకుంటున్న పేరుని ఏనాడో అది తలతన్నేసింది.

★

